క్లుప్తంగా

ముగిసిన తిరునక్షత్ర పూజలు



దివ్య ప్రబంధ పారాయణ నిర్వహిస్తున్న వైదికులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఐదు రోజులుగా నిర్వహించిన తిరుమంగై ఆళ్వార్ తిరునక్షత్ర పూజలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను, తిరుమంగై ఆళ్వార్‌ను ఆలయ ఆస్థాన మండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు. విశేషంగా పూజలు నిర్వహించారు. దివ్యప్రబంధ పారాయణాలు పఠించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అధ్యాపకులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

సాయిబాబా ఆలయ నిర్మాణానికి విరాళం



సాయిబాబా ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు

పరవాడ: మండలంలో పి.బోనంగి గ్రామంలో సాయిరామరాజు లేఅవుట్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ షిర్డీసాయిబాబా ఆలయ నిర్మాణానికి అగనంపూడి గ్రామానికి చెందిన అన్నదమ్ములు మామిడి జగన్నాథం, మామిడి సోము నాయుడు రూ.101116 నగదు ఆలయ కమిటీ ప్రతినిధులు బి.నాగేశ్వరరావు, జె.శ్రీను, జి.లోకేష్‌లకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్, ఉప సర్పంచ్ గొంతిన రాము, గ్రామ పెద్దలు కలిదిండి రామకృష్ణరాజు, మామిడి శ్రీను, మంగాల సూరిబాబు, అప్పలరాజు, ఇళ్లపు శివ, బిల్లపాటి నారాయణస్వామి, ఎం.సంజీవరావు పాల్గొన్నారు.

కరాటే విజేతలకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న సంస్థ ప్రాజెక్టు హెడ్ సిన్హా, అధికారులు

పరవాడ: విశాఖపట్నం పోర్టు స్టేడియంలో ఈ నెల 24, 25, 26 తేదీల్లో జరిగిన 19వ అంతర్జాతీయ కరాటే పోటీల్లో ఎన్టీపీసీ దీపాంజలినగర్ కు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చి పతకాల పంట పండించారు. ఈ పోటీల్లో రెండు విభాగాలుగా పాల్గొన్న విద్యార్థులు అశ్విని అనీష్, కె.కె.ఎస్.సాత్విక్, కేకే వైష్ణవిలు చెరో రెండు బంగారు పతకాలు సాధించారు. అలాగే టి.సుమశ్రీ, టి.భవ్యశ్రీలు బంగారు, వెండి పతకాలు సాధించారు. సమీక్షా సాహు బంగారు, రాగి పతకాలు, గొర్లి వంశీ బంగారు పతకం, ఎస్.ఖ్యాతినాథ్ రెండు వెండి పతకాలు సాధించారు. వీరికి కోచ్‌గా గొర్లె పుష్పారావు వ్యవహరించారు. కరాటే పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్ కుమార్ సిన్హా సోమవారం అభినందించారు. రిఫరీగా ఎం.తులసీరావు వ్యవహరించారు.

సమ్మె నోటీసు అందజేత

సబ్బవరం: విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు,అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్లతో నిరవధిక సమ్మె చేయనున్నట్టు సబ్బవరం ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యులు తెలిపారు.దీనిలో భాగంగా మండల విద్యా వనరుల కేంద్రంలో సమ్మె నోటీసును సోమవారం ఎంఈవో లక్ష్మణరావుకు అందజేశారు. నెలల తరబడి వేతనాలు విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. నోటీసు అందజేసినవారిలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు,అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎం.మహేష్, ఎస్. కళాభారతి, ఐ. దీపిక,ఎస్. భూలక్ష్మి తదితరులు ఉన్నారు.

లభించని ఆచూకీ

పరవాడ: తంతడి సముద్ర తీరంలో ఆదివారం స్నానానికి దిగి గల్లంతైన పరవాడ బీసీ కాలనీకి చెందిన విద్యార్థి జంగాల రాజేష్ ఆచూకీ సోమవారం సాయంత్రానికి కూడా లభించలేదని ఎస్ఐ మల్లేశ్వరరావు చెప్పారు. సోమవారం ఉదయం నుంచి ఇండియన్ నేవీకి చెందిన హెలికాప్టర్ విస్తృతంగా గాలించినా ఫలితం దక్కలేదు. మంగళవారం నాటికి ఆచూకీ లభించవచ్చునని ఎస్ఐ తెలిపారు.

అంగన్‌వాడీ.. నూతన ఒరవడి

- సరస్వతీ నిలయాలుగా రూపాంతరం
- కేంద్రాల్లో సౌకర్యాల కోసం భారీగా నిధులు
- 111 కేంద్రాలకు రూ.4.82 కోట్లు విడుదల
- పాత భవనాలకు మరమ్మతులు.. కొత్త భవనాల నిర్మాణానికి సిద్ధం
- వికాస కేంద్రాలుగా రూపుదిద్దుకోనున్న అంగన్‌వాడీలు



నాడు టీడీపీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీల నిర్వహణ గాలికి వదిలేశారు. పిల్లలు వయసుకు తగిన ఎత్తు, ఎత్తుకు తగిన బరువు లేకపోయినా వారి గురించి ఆలోచనలు లేవు. ఈ కారణంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన పిల్లలు చాలామంది పౌష్టికాహార లోపంతో అనారోగ్యానికి గురయ్యేవారు. ఆయా లోపాలను అధిగమించేందుకు పిల్లలకు రోజూ గుడ్లు, పాలు అందించాలి. కానీ టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా అవి సక్రమంగా అందేవి కావు.. కనీస సౌకర్యాలు లేక పిల్లలు, సిబ్బంది తీవ్ర అవస్థలు పడేవారు.

నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పిల్లల జీవితంలో మొదటి ఐదేళ్లు అత్యంత క్లిష్టమైన దశ అని గుర్తించింది. పిల్లల్లో సమర్థవంతమైన అభిజ్ఞ, భావోద్వేగ, సామాజిక వికాసానికి సురక్షితమైన, స్వచ్ఛమైన వాతావరణం ఉండాలని గుర్తించింది. అందుకు తగ్గట్టుగా అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలను మార్చేసింది సీఎం వైఎస్ జగన్ సర్కారు. మన అంగన్‌వాడీలు నాడు-నేడు పేరిట కనీస సౌకర్యాలతో పాటు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంది. మెరుగైన విద్య అందిస్తుంది. పిల్లలకు ఇచ్చే మెనూలో సమూల మార్పులు తీసుకువచ్చింది. అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి పథం వైపు నడిపిస్తోంది.

పెందుర్తి: అంగన్‌వాడీ కేంద్రాలు సరస్వతీ నిలయాలుగా రూపాంతరం చెందాయి. ఒకప్పుడు పౌష్టికాహారం పంపిణీ.. చిన్నారులకు కూడా అరకొర పౌష్టికాహారం ఇచ్చేసి కాలక్షేపం చేసి ఇంటికే పంపేవారు. నేడు అంగన్‌వాడీ చిన్నారుల భవితకు నిలయాలుగా మారాయి. సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్నాయి. పిల్లల జ్ఞాన సముపార్జనకు తొలి మెట్టుగా భావించే అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంస్కరణలు చేపట్టారు. పాఠశాలల తరహాలోనే అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం/మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసి కేంద్రాలను అందంగా తీర్చిదిద్దుతుంది. నాడు-నేడు కింద కొత్త భవనాల నిర్మాణం, పాత భవనాలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యం, ఆన్‌లైన్ హాజరు వంటి సంస్కరణలతో ముందడుగు వేసింది. దీంతో అంగన్‌వాడీలు పిల్లల వికాస కేంద్రాలుగా రూపాంతరం చెందుతున్నాయి. అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆటపాటలతో బోధన ఉండడంతో పిల్లలు ఉత్సాహంగా క్రమం తప్పకుండా హాజరవుతున్నారు.



మహాలక్ష్మీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

అంతా నిర్లక్ష్యమే ..

టీడీపీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాలు పూర్తిగా నిర్వీర్యమై దాదాపు ఉనికిని కోల్పోయాయి. చిన్నారులకు మానసిక పరిపక్వత కల్పించాల్సిన కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో తల్లిదండ్రులు కేంద్రాలకు పంపడానికి వెనుకడుగు వేసేవారు. చిన్న వయసులో పిల్లలకు పౌష్టికాహారం అందించి వారి ఆలనా పాలనా చూడాల్సిన కేంద్రాలు అనాథలుగా మిగిలిపోయాయి. కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరుకోగా..మరికొన్ని అసౌకర్యాల నడుమ అద్దె భవనాల్లో కాలం వెళ్లందీసే దుస్థితి ఉండేది. సరైన నిఘా, నియంత్రణ లేక పిల్లలకు అందాల్సిన పౌష్టికాహారం పక్కతోవ పట్టిన ఆరోపణలు కోకొల్లలు.



నాడు: సరిపల్లిలో దీనస్థితిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

నేడు సమూల మార్పులు

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు తీసుకున్న తర్వాత అభివృద్ధి సంక్షేమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి చర్యలు తీసుకున్నారు. పెందుర్తి మండలంలో ఇప్పటికే కేంద్రాలను అభివృద్ధి చేసింది. తాజాగా పెందుర్తి ప్రాజెక్ట్ పరిధిలోని 111 (పెందుర్తి మండలంలో 44, గాజువాకలో 26, పెదగంట్యాడలో 41) అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి 'మన అంగన్వాడీలు నాడు-నేడు' పేరిట రూ.4.82 కోట్ల నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించింది. నాలుగేళ్లుగా పీపీ-1 పేరుతో 3ప్లస్, పీపీ-2 పేరిట 4ప్లస్ పిల్లలకు ప్రతీ రోజూ ఆటలు, పాటలు, ఇంగ్లిష్ బోధిస్తున్నారు.



నేడు: సరిపల్లిలో మరమ్మతుల తర్వాత సుందరంగా అంగన్‌వాడీ కేంద్రం

- ఏడు నెలల నుంచి 3 ఏళ్ల చిన్నారులకు నెలకు 25 కోడిగుడ్లు, రెండున్నర లీటర్ల పాలు ఇస్తున్నారు.
- గర్భిణులు, బాలింతలకు నెలలో వైఎస్సార్ కిట్ పేరుతో రెండున్నర కిలోల రాగి(చోడి)పిండి, కిలో అటుకులు, 250 గ్రాముల పప్పు చెక్కీ, 250 గ్రాముల కర్జూరం, 250 గ్రాముల బెల్లం, 3 కిలోల బియ్యం, అరకిలో నూనె, కిలో కందిపప్పు, 25 కోడిగుడ్లు, 25 పాలు ప్యాకెట్లు అందిస్తున్నారు.

సబ్బవరం: మండలంలో 87 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 74 మెయిన్ సెంటర్లు, 13 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు-13 ఉన్నాయి.



అక్కిరెడ్డిపాలెం అంగన్‌వాడీ కేంద్రం

నూతన నిర్మాణాలు చకచకా

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సబ్బవరంలోని కోమటవీధి,ఎస్సీ, బీసీ కాలనీ, చినగొల్లలపాలెంలో నూతనంగా అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మించింది.

- పీతపాలెం, అమృతపురం-1,గొల్లలపాలెం శివారు అమ్మరపిన్నివానిపాలెం,గుల్లేపల్లి-4 కేంద్రాలకు నూతన భవనాలు ప్రారంభానికి సిద్ధంగా వీటితో పాటు మండలంలోని మరో 5 వరకూ అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు సాగుతున్నాయి.
- ఒక్కో కేంద్రాన్ని రూ.10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మాణాలు ప్రారంభించారు నిధులు చాలక పోవడంతో తిరిగి ప్రతిపాదనలు సిద్ధం చేసి రూ.5 లక్షల వరకూ జెడ్పీటీసీ నిధులు వెచ్చించి పనులు చేస్తున్నారు.



గర్భిణులకు సీమంతం చేసిన సంపూర్ణ పోషణ కిట్‌లు అందజేసిన అధికారులు(ఫైల్)

పూర్తిస్థాయిలో పౌష్టికాహారం



గత ప్రభుత్వంలో అంగన్‌వాడీ కేంద్రాలు బాగుండేవి కాదు. కనీస సౌకర్యాలు లేక పిల్లలు ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయి. మా పిల్లలకు బలవర్ధకమైన ఆహారం అందిస్తున్నారు. గతంలో గర్భిణులు, బాలింతలు కేంద్రానికి వచ్చి భోజనం చేయాలనే నిబంధన ఉండేది. దీంతో చాలా ఇబ్బంది పడేవాళ్లం. ఇప్పుడు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పేరుతో నేరుగా ఇళ్లకే పౌష్టికాహారం అందిస్తున్నారు.

– కె.బిందు, పినగాడి.

హాజరు శాతం పెరిగింది



అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది. ఇప్పటికే పలు కేంద్రాలను పాఠశాల నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేసింది. తాజాగా ప్రాజెక్ట్ పరిధిలో 111 కేంద్రాల మరమ్మతులు/నూతన భవనాల నిర్మాణం కోసం రూ.4.82 కోట్లు మంజూరు చేసింది. పనులు కూడా ప్రారంభం అవుతున్నాయి. కేంద్రాల్లో సౌకర్యాలు పూర్తిస్థాయిలో ఉండడంతో హాజరు శాతం ఘననీయంగా పెరిగింది. వైఎస్సార్ పౌష్టికాహార కిట్లు సమర్థవంతంగా అందిస్తున్నాం. మెనూ పక్కాగా అమలు చేయడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–డి.నీలవేణి, సీడీపీవో, పెందుర్తి ప్రాజెక్ట్

పకడ్బందీగా ఆడుదాం ఆంధ్ర

కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి

సబ్బవరం: క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. మండలంలోని ఆరిపాక సచివాలయంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర రిజిస్ట్రేషన్ ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంపై వలంటీర్లు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. వచ్చే నెల 15 నుంచి 20వ తేదీ వరకూ ఈ క్రీడలు గ్రామ స్థాయిలో జరుగుతాయన్నారు. మండలంలో ఉన్న 363 మంది గ్రామ వలంటీర్లు క్రీడల ప్రోత్సాహానికి కృషి చేయాలన్నారు. వీలైనంత ఎక్కువ మందిని రిజిస్ట్రేషన్ చేయించి క్రీడల్లో పాల్గొనే విధంగా చూడాలని ఆదేశించారు. ఆడుదాం ఆంధ్ర రిజిస్ట్రేషన్ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కావడంతో రిజిస్ట్రర్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీడీవో రమేష్ నాయుడు, పాలిశెట్టి సురేష్ రాజ్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి మంజులా వాణి, డీఎల్‌డీవో ఉదయశ్రీ, ఈవోఆర్‌డీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

'జగనన్నకు చెబుదాం'కు 9 వినతులు

పెందుర్తి: జీవీఎంసీ జోన్-8 వేపగుంటలోనికార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో పలు సమస్యలపై మొత్తం 9 వినతులు వచ్చాయి. అక్రమ నిర్మాణాలు, ఇతర సమస్యలపై జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడుకు ఫిర్యాదు చేశారు. పలు చోట్ల కాలువల నిర్మాణం చేపట్టాలని ఆయా ప్రాంతాల వాసులు విన్నవించారు. అక్రమ నిర్మాణలపై ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ సమస్యలపై తక్షణమే స్పందించాలని వివిధ శాఖల అధికారులకు సూచించారు. జోన్-8 పరిధిలోని అన్ని విభాగాల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

గ్రామీణ క్రీడాకారులకు చేయూత

పెందుర్తి: గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు తనవంతు ప్రోత్సాహం అందిస్తానని మాజీ జెడ్పీటీసీ కంచిపాటి విశ్వనాథనాయుడు అన్నారు. మండలంలోని వాలిమెరక జుత్తాడలో కొద్దిరోజులుగా జరుగుతున్న కంచిపాటి రాము స్మారక క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. సాయంత్రం టోర్నీ విన్నర్స్ విరాట్ ఎలెవెన్, రన్నరప్ సత్య స్ట్రైకర్స్‌కు విశ్వనాథనాయుడు, పెందుర్తి సీఐ ఎం.శ్రీనివాసరావు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కంచిపాటి మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉత్తేజం కలుగుతుందని చెప్పారు. రానున్న రోజుల్లో క్రీడాకారులకు మరింత చేయూతనందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో గుర్రంపాలెం సర్పంచ్ ఉగ్గిన గోవింద, నాయకులు జామి గంగునాయుడు, మధుపాడ అంజి, గండి భూషణరావు, అప్పలరాజు, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న విశ్వనాథనాయుడు, సీఐ శ్రీనివాసరావు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పెందుర్తి: మండలంలోని సరిపల్లి రైతు భరోసా కేంద్రంలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ మధుపాడ నాగమణి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు మేలు చేయాలన్న సంకల్పంతో రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించిందన్నారు. సాధారణ రకం ధాన్యం రూ.2183(100 కిలోలు), గ్రేడ్ ఎ రకానికి రూ.2,203(100 కిలోలు) నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రమణ, వైస్ సర్పంచ్ హేమంత్, సీఎస్ డీఎం రాజేశ్వరి, డీఆర్‌డీఏ డీపీఎం వైదేహి, మండల వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్, వెలుగు ఏపీఎం రమణ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ నాగమణి

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి

- భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు
- పరమేశ్వరుడికి విశేష అభిషేకాలు



పూజలందుకున్న సోమలింగేశ్వరస్వామి



సుజాతనగర్‌లో పూజలందుకున్న శివుడు

పెందుర్తి: కార్తీక పౌర్ణమి, రెండో సోమవారం పురస్కరించుకుని నియోజకవర్గంలోని శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

- సరిపల్లి శివాలయానికి ఉదయం నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. శివుడికి స్వహస్తాలతో అభిషేకాలు, పూజలు చేశారు. ఎంపీటీసీ సభ్యుడు గొల్లవిల్లి రమణ, ఆలయ కమిటీ ప్రతినిధులు పూజల్లో పాల్గొన్నారు.
- సుజాతనగర్ హరిహక్షేత్రంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు పెద్ద ఎత్తున దీపారాధన చేశారు.
- చింతలగ్రహారం గవరపాలెంలో మహాశివునికి పూజలు జరిపారు. దీపారాధన చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో దాదాపు 4 వేల మంది అన్నప్రసాదాలు స్వీకరించారు. స్వామిని కార్పొరేటర్ ముమ్మన దేముడు తదితరులు దర్శించుకున్నారు.
- పినగాడి, చినముషిడివాడ, కృష్ణరాయపురం, సాధూమఠం ప్రాంతాల్లో శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అలివేలుమంగమ్మ ఆలయం, పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో దీపారాధనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



లింగాల తిరుగుడులో ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు



పరవాడలో శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న పండితులు

సింహాచలం: కార్తీక సోమవారం పురస్కరించుకుని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి శివాలయాలకు భక్తులు పోటెత్తారు. పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు,పూజలు నిర్వహించారు. సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి, కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాల్లో స్వామికి ఉదయం అర్చకులు అభిషేకాలు చేశారు. సాయంత్రం ఆకాశదీప మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే 93వవార్డులో ఉన్న ప్రహ్లాదపురంలోని శివాలయం, 98వవార్డులోని పాత అడవివరం, విజినిగిరిపాలెం, కాపుదిబ్బ, ప్రియాగార్డెన్స్, సింహపురికాలనీలోని శివాలయాల్లో పరమేశ్వరుడికి అభిషేకాలు నిర్వహించారు. తులసి కోటలు, రావి, మర్రిచెట్లు, ధ్వజస్తంభాల వద్ద దీపారాధన చేశారు.

సబ్బవరం మండలంలో..

సబ్బవరం: మండలంలోని పలు శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు.కార్తీకమాసం రెండో సోమవారం, పౌర్ణమి కావడంతో లింగాలతిరుగుడులోని స్వయంభూ సోమలింగేశ్వరస్వామి,యాతపాలెంలోని ద్వాదశ జ్యోతిర్లింగ సహిత గౌరీ పరమేశ్వరుల క్షేత్రంతో పాటు ఇరువాడలోని భీమలింగేశ్వరస్వామి,సబ్బవరం,గొర్లివానిపాలెంలోని ఉమా రామలింగేశ్వరస్వామివారి ఆలయాల్లో భక్తులు బారులు తీరి స్వామిని దర్శించుకున్నారు. లింగాలతిరుగుడులో నిర్వహించిన కోలాటం పోటీలు ఆకట్టుకున్నాయి.మధ్యాహ్నం స్వామివారి సన్నిధిలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.




మల్లికార్జున ఆలయంలో అభిషేక పూజల్లో పాల్గొన్న భక్తులు



సరిపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు

పరవాడ: మండలంలో శివాలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. తాడి ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన శివపార్వతులను దర్శించుకోవడానికి మండల నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. శివపార్వతులకు పూలభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అలాగే భర్నికం, దీపాంజలినగర్, నాయుడుపాలెం, లేమర్తి, పరవాడ శివాలయాలకు భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాన్ని స్వీకరించారు.



గవరపాలెంలో పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ ముమ్మన దేముడు, భక్తులు

రిపబ్లిక్ డే పై అవగాహన సదస్సు



కుమార్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో రిపబ్లిక్ డే పరేడ్ సన్నాహాలు ఎలా జరుగుతాయన్న అంశంపై విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ కో ఆర్డినేటర్ బి.వి.ఎస్ కుమార్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ వలంటీర్లుగా సేవలందించే విద్యార్థులను ఇండియన్ యూత్ రెడ్‌క్రాస్ అని సంబోధిస్తారని చెప్పారు. డిల్లీ ఎర్రకోటపై వచ్చే ఏడాది జనవరి 26న జరగబోయే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆదర్శ్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. కుమార్‌ను కళాశాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టి.థియోఫిలాస్, ప్రిన్సిపాల్ ఫ్లోరా, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.